# చేకూరపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హైస్కూల్ వజ్రోత్సవ సందర్భం

# రఘు రావిపాటి - జ్ఞాపకాల దొంతరలు

అందరికి నమస్కారం. ఐదు నెలలు క్రితం మన పాఠశాల వజ్రోత్సవం జరుపుకోవాలనే ఆలోచన మొదలైనప్పటి నుండి దాదాపు ప్రతి రోజు చిన్ననాటి జ్ఞాపకాలు దొంతరులు నా మదిలో మెదులుతూ ఒక విధమైన ఆనందోద్వేగాలకు గురి చేస్తున్నాయి. నా జీవితానికి పునాది వేసిన మా గురువుల కృషి, మిత్రుల సహకారం, గ్రామీణ వాతావరణం గుర్తుకు వస్తూ ఎప్పుడెప్పుడూ నా మిత్రులను, గురువులను కలుస్తానా అని ఆరాటపడుతున్నాను.

ఒకటా, రెండా, కొన్ని వందల అనుభవాలు, పోతురాజు నుండి పోలేరమ్మ వరకు, పల్లె నుండి ఎరుకల పాలెం వరకు, గుండ్లకమ్మ నుండి కాపుగారి గుంట వరకు, గాంధీ బొమ్మ నుండి కరణం గారి వీధి వరకు, చేకూరపాడులో మాత్రమే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాలలో కూడా బాల్యం మరియు కౌమార దశలోని నా అనుభవాలు నా వ్యక్తిత్వానికి పునాది వేసి నన్ను ఈ రోజు ఇలా మలిచాయంటే ఏ మాత్రం సందేహం లేదు. ఇన్ని అనుభవాలు, నాలో కదిలే భావోద్వేగాలు అక్షర రూపంలో పెట్టటం అసాధ్యమైనప్పటికి నేటి నా స్థాయికి కారణమైన మా గురువుల గురించి నా జ్ఞాపకాలను క్లుప్తంగా మీ అందరితో పంచుకోవాలని నా ఈ చిన్ని ప్రయత్నం మరియు ఆకాంక్ష.

నాతోపాటు, నా చెల్లెలు కళ్యాణి, మా అమ్మగారు సుభద్ర (పెనుబోతు) కూడా మన పాఠశాల పూర్వ విద్యార్థులు కావటం నిజంగా నాకు ఒక ప్రత్యేక అనుభూతి మరియు గర్వకాణం.

మా నాన్న గారు మధుసూధనరావుగారి స్వగ్రామం చేకూరపాడు కానప్పటికీ, మా పెదనాన్న తుమ్మల రామయ్యగారు, పెద్దమ్మ నాగమ్మ గారిది చేకూరపాడు కావడం, మా అమ్మ వాళ్ళతోపాటు చేకూరపాడుతో చదువుకొనడం, నేను పుట్టిందికూడా చేకూరపాడు లోనే కావడంవల్ల, నా స్వగ్రామం చేకూరపాడుగా మిగిలిపోయింది. నాన్న ఉద్యోగరీత్యా నేను వేరే స్కూల్స్‌లో ఎలిమెంటరీ క్లాసులు మొదలుపెట్టినా, నేను 4వ తరగతి కనిగిరిలో చదువుతున్నప్పుడు రామయ్య పెదనాన్న అకాల మరణంవల్ల మరల చేకూరపాడులోనే నా బాల్యం మరియు కౌమారం, 10వ తరగతి వరకు చదువు సాగింది. మన పాఠశాలలో ప్రథమ విద్యార్థుల్లో ఒకరైన మా అమ్మ ఇంట్లో నా మొదటి గురువు అయితే, నాకు తెలిసీ తెలియని వయసులోనే నా వ్యక్తిత్వానికి పునాదివేసిన వ్యక్తి మాత్రం మా రామయ్య పెదనాన్న అంటే అతిశయోక్తి కాదు. ఆయనతో గడిపిన క్షణాలు, ఆయన రాత్రిపూట నాకు మరియు ఉమా బావకు(ఉషాకిరణ్) చెప్పిన కథలు, ఆయన నా మీద చూపించిన వాత్సల్యం నా మీద ఆ చిన్న వయసులో గట్టి ప్రభావాన్ని చూపాయని నా నమ్మకం. ఆయన దురదృష్టవశాత్తు మాకు తొందరగా దూరమయినప్పటికీ, ఆ లోటు నాకు ఒక అమ్మ బదులు ఇద్దరు అమ్మల (అమ్మ,

నాగమ్మ పెద్దమ్మ) ప్రేమను పొందటానికి అవకాశం కల్పించింది.

ఇకపోతే మా చేకూరపాడు శ్రీ వేణుగోపాలస్వామి సంస్కృత ఉన్నత పాఠశాల, అందులో మాకు విద్యాబోధన చేసిన గురువుల గురించి చెప్పాలంటే ఒక పుస్తకమే వ్రాయవచ్చు. కొందరు మిత్రులు వారి జ్ఞాపకాల్లో ప్రస్తావించినట్లు, పూర్వ కాలంలో ఉండే ఆశ్రమ గురుకులానికి మా పాఠశాల తీసిపోదు. నా వరకు నేను ఈ పాఠశాలలో ఒక విద్య మాత్రమే కాదు, నా జీవితానికి పునాది వేసిన ఎన్నో మరపురాని మరచిపోలేని జీవిత పాఠాలు నేర్చుకున్నానంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

ఒక్కొక్క గురువు తనదైన శైలిలో నన్ను తీర్చి దిద్దారనటంలో సందేహం లేదు. నాకు వీలైనంత వరకు వారి గురించి, నన్ను ప్రేరణ కలిగించిన కొన్ని అనుభవాల గురించి మీతో క్లుప్తంగా పంచుకోవడానికి ప్రయత్నిస్తాను.

అందరికంటే ముందు మా ప్రధానోపాధ్యాయులు శ్రీ తన్నీరు గురవయ్య మాష్టారు గారు. స్కూలులో గురవయ్య మాష్టారు క్రమశిక్షణకు మారుపేరయినా, నాకు బయట మాత్రం గురవయ్య మామయ్యగా పిలుచుకోవడం ఒక విచిత్రమైన అనుభూతికి గురి చేసేది. వీరి కుటుంబంలో ఉన్న కమలమ్మ అత్త, రాధక్క, బుజ్జి అక్క, మా ఉమా బావ (ఉషాకిరణ్), మా కుటుంబానికి అత్యంత ఆప్తులు. మా గురువయ్య మాష్టారు ఎన్నో వందలమంది విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత. నన్ను ఆయన చిన్నప్పుడు ముద్దుగా ముని అని పిలిచేవారు. మా పాఠశాలకు అత్యంత ఎక్కువకాలం ప్రధానోపాధ్యాయులుగా పని చేశారంటే ఆయన సామర్థ్యం గురించి వేరే చెప్పక్కర్లేదు. ఆయనతో నాకు ఎన్నో మరపురాని అనుభవాలు ఉన్నా, నాకు ఒక సంఘటన ఎప్పుడూ గుర్తు ఉంటుంది. నేను క్లాస్ సిపియల్‌గా ఉన్నప్పుడు, ఒక రోజు స్కూల్ బందుకు పిలుపు ఇచ్చినప్పుడు నేను అందరితో పాటు నా స్నేహితులతో తరగతిను బహిష్కరించి బయట తిరుగుతున్నప్పుడు మాష్టారు నన్ను పిలిపించి బందుకు కారణం ఏంటి అని అడిగారు. ఒక్కసారిగా నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు మాటలు రాలేదు. ఆయన నన్ను ఏమీ తిట్టకుండా తనదైన శైలిలో "ఒరే, ముందు నువ్వు నాయకుడిగా ఒక నిర్ణయం తీసుకునే ముందు, దానికి తగు కారణం, మంచి చెడులు బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకో" అని చెప్పిన మాటలు ఈ రోజుకు కూడా నాలో బలంగా నాటుకుపోయాయి. గురవయ్య మాష్టారుతో నాకు ఉన్న నా అనుబంధం 10వ తరగతితో ముగిసింది కాదు, ఆయన నన్ను ఇంటర్మీడియట్ విజ్ఞాన్‌లో చేర్పించడం, అలాగే ఇంజనీరింగ్‌లో కూడా చేర్పించి మా కుటుంబానికి ఎంతో తోడ్పాటును అందించిన వ్యక్తి. ఈ వజ్రోత్సవం ద్వారా ఆయన్ని సన్మానించుకోవచ్చు అనే ఆలోచన నన్ను ఎంతో ఆనందానికి గురి చేస్తుంది.

మా ఇంగ్లీషు మేడం శ్రీమతి మారేపల్లి సూర్యకుమారిగారితో నాకు ఉన్న అనుబంధం ఒక ప్రత్యేకమైనది. మొదట్లో వారితో బిడియంగా ఉండే నేను, 9వ తరగతి అయిపోయేసరికి ఒక కుటుంబ సభ్యుడిలాగా వారి ఇంట్లో ఆదివారం ఉదయాలు పుస్తకాలు చదువుతూ, టివి చూస్తూ గడిపేవాన్ని. తెలుగు మీడియంలో చదువుకున్నప్పటికీ, మేడంగారి ప్రత్యేక శ్రద్ధవలన నేను ఇంటర్, ఇంజనీరింగ్‌లలో

ఇంగ్లీషు మీడియంలో అంత ఇబ్బంది పడలేదు అని ఖచ్చితంగా చెప్పగలను. మన బాల్యంలో కొన్ని సంఘటనలు మనలను బాగా కదిలిస్తాయి. అందులో ఒకటి ప్రత్యేకంగా ప్రస్తావించదగిన విషయం స్వతహాగా చదువులో ఒకింత ముందు ఉండటంవల్లో, స్నేహితుల మధ్య ఉండే సహజ స్వేచ్ఛవల్ల కానీ, నేను బాగా అల్లరి చేసేవాడిని. దానిలో భాగంగా ఒకరోజు నేను వెనుక బెంచీ నుంచి కొంతమంది మీద సిరా చల్లినప్పుడు, మేడం గారు ముందు నన్ను తరగతి బయటకు పంపించి మిగతా విద్యార్థులతో చర్చించి, తరువాత నన్ను పిలిచి నాకు అర్థమయ్యే రీతిలో నా ప్రవర్తన ఎలా అందరికీ నచ్చేటట్లు ఉండాలో, ఎవరినీ ఇబ్బంది పెట్టేటట్లు ఉండకూడదు అని నాకు చెప్పిన విషయాలు నాకు ఎప్పటికీ గుర్తు ఉంటుంది. ఇంకొక్క గమ్మత్తైన విషయం ఏంటంటే, నాకు మేడంగారి ఇంట్లో వచ్చే కుక్కర్ విజిల్ సౌండ్, దాని నుండి వచ్చే వాసన అంటే చిన్నప్పుడు చాలా ఇష్టంగా ఉండేది. Thank you madam for everything you have done for me and every student in our school.

మా తెలుగు గురువులు శ్రీ దివి సారంగపాణిగారు నేర్పిన తెలుగు పాఠాలు, సంధులు, సమాసాలు ఇప్పటికీ కొన్ని నాకు గుర్తున్నాయంటే అది ఖచ్చితంగా ఆయన చలువే. అమెరికాలో స్థిరపడ్డప్పటికీ వీలు దొరికినప్పుడల్లా తెలుగు సాహిత్య సమితి చర్చా గోష్ఠిలలో పాల్గొనడానికి దోహదపడటమే కాకుండా, నేను డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చక్కగా నిర్వర్తించడానికి, వివిధ "తానా" కార్యకలాపాల్లో పాలుపంచుకోవడానికి, 2015లో డెట్రాయిట్‌లో జరిగిన 'తానా' మహా సభల్లో కీలకపాత్ర పోషించడానికి ఎంతో సహకరించాయని చెప్పడంలో మొహమాటం లేదు. మామూలుగా మితభాషిగా ఉండే మా సారంగపాణి మాష్టారు అప్పుడప్పుడు విసిరే చలోక్తులు ఇంకా గుర్తుకు వస్తుంటాయి. పాఠశాలలో విద్యాబోధనతో పాటు చేకూరపాడు గ్రామస్తులందరికీ ఆయన అందించిన వైద్యసేవలు చాలా ప్రశంసనీయం.

మాకు గణితం నేర్పిన శ్రీ పీసపాటి రామారావు మాష్టారుగారి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. సహజంగా గణితం అంటే ఆసక్తి ఉన్న నాకు ఆయన మరింత సరళం చేసి చెప్పిన పాఠాలు ఇంటర్మీడియట్ మరియు ఇంజనీరింగ్‌లో కూడా సులువుగా గట్టెక్కడానికి ఎంతో సహాయపడ్డాయి. ఆయన కుటుంబ అవసరాల రీత్యా చేకూరపాడు గ్రామంలో నివసించకపోవడంవల్ల పాఠశాల బయట వారితో నాకు ఎక్కువ అనుబంధం లేనప్పటికీ రామారావు మాష్టారు వేసిన గణిత బీజాలు నాలో బాగా నాటుకుపోయాయని చెప్పడానికి ఏ మాత్రం మొహమాటపడను.

నాలో ఒక రవ్వంత ఆత్మవిశ్వాసం, కొంత నాయకత్వ లక్షణాలు అబ్బడానికి దోహదపడ్డ ఒక సంఘటన దానికి బాధ్యుడయిన మా హిందీ మాష్టారు శ్రీ యర్రమనేని వెంకటేశ్వర్లు గారి గురించి తప్పకుండా గుర్తుకు చేసుకోవాలి. అది 7వ తరగతి చదువుతున్న రోజులు. ఉన్నట్టుండి ఒక రోజు నాకు 8వ తరగతి నుండి హిందీ మాస్టారు రమ్మంటున్నారని పిలుపు వచ్చింది. అయ్య బాబోయ్, ఏదో చిలిపి పని చేసి ఉంటాను, దానికి చితకబాదడానికి పిలుస్తున్నారని ఫిక్స్ అయిపోయి మనసు గట్టి పరుచుకొని వెళ్ళిన నాకు వెంకటేశ్వర్లు మాష్టారు గుమ్మంలోనే నుంచోపెట్టి, 'ఏరా రఘూ, హిందీలో

"పైన" అనే పదాన్ని ఏమంటారు అని అడిగారు. జవాబు చెప్పగానే నన్ను ఆయన మా సీనియర్ల ముందర మెచ్చుకొని ఆయన మాట్లాడిన ప్రోత్సాహక విషయాలు నా ఆత్మవిశ్వాసం పెంచడమే కాకుండా నాకు హిందీ పట్ల మరింత ఇష్టాన్ని కలిగించింది.

నా స్కూలు రోజుల్లో ఏదైనా కొంత కొరవ వుందంటే అది శ్రీ పరిటాల సుబ్బారావు మాష్టారి దగ్గర సోషల్ స్టడీస్ పాఠాలు నేర్చుకోకపోవడమే. 7వ తరగతి తరువాత, నేను మాథమేటిక్స్ మరియు సంస్కృతం సబ్జెక్ట్స్ తీసుకుని సోషల్ స్టడీస్‌ను తీసుకోకపోవడంవల్ల ఆయన దగ్గర పాఠాలు నేర్చుకునే అవకాశం కలుగలేదు. కానీ అదృష్టవశాత్తు, ఆయనకు క్రీడల మీద ఉన్న ఆసక్తివలన, మాతో బాడ్మింటన్ కలిసి ఆడటంవల్ల ఆయనతో ఎక్కువ సమయం గడిపే అవకాశం దక్కింది. ఒక మాష్టారుగా కంటే ఒక శ్రేయోభిలాషిలాగా అనిపించే మా సుబ్బారావు మాష్టారు దాదాపు ప్రతి విద్యార్థికి ప్రీతిపాత్రుడంటే అతిశయోక్తి కాదేమో. సుబ్బారావు మాష్టారు మాట్లాడే విధానం, ఆయన వ్యక్తిత్వం ఎవరికైనా ఒకింత గౌరవం కలిగిస్తుంది. నేను 10వ తరగతి పూర్తి చేసిన తరువాత కూడా మాష్టారు గారి అబ్బాయి రవిచందుతో నాకు ఉన్న స్నేహంవల్ల ఆయనతో అప్పుడప్పుడు మాట్లాడే అవకాశం నాకు కలిగింది. మా సుబ్బారావు మాస్టారు గారి సున్నితమైన వామపక్ష భావాలు కూడా మా అందరి వ్యక్తిత్వ మరియు సమ సమాజ వికాసానికి తోడ్పడ్డాయని చెప్పవచ్చు.

తెలుగుదనం వుట్టిపడే తెల్ల పంచెకట్టుతో, ఎప్పుడూ చలాకీగా ఉత్సాహంగా చలోక్తులు విసురుతూ ఉండే మా శ్రీ వెల్ది వెంకటేశ్వర్లు మాష్టారు అంటే ఎవరూ మర్చిపోలేరు. నాకు బాగా గుర్తు ఉంది, ఇప్పటికి కూడా మా పిల్లలతో, స్నేహితులతో అప్పుడప్పుడు పంచుకునే ఒక సరదా విషయం ఇక్కడ ప్రస్తావించుకోవచ్చు. ఆయన మాకు 6వ తరగతిలో ఆంగ్లం బోధించే సమయంలో, ఒక త్రైమాసిక పరీక్షలో 'ఈజీ' అనే పదానికి వ్యతిరేకపదం వ్రాయమని అడిగినప్పుడు నాకు ఉన్న మిడిమిడి జ్ఞానంతో అతి తెలివి ప్రదర్శించి దానికి జవాబు 'KASTAMU" అని తెలుగు పదాన్ని ఇంగ్లీషులో వ్రాశాను. తరగతిలో మార్కులు పంచే సమయంలో, వెంకటేశ్వర్లు మాష్టారు నన్ను అందరి ముందు పిలిచి నా అతి తెలివికి నా మీద జోకులు విసిరినా, దానికి 1/2 మార్కు వేసి నా సమయస్ఫూర్తి మెచ్చుకోవడం నేను ఎప్పటికీ మర్చిపోలేను. 8వ తరగతి నుండి మాకు ఆయన తరగతిలో విద్యాబోధన చేయనప్పటికీ, ఆయన దగ్గర నేర్చుకున్న మొదటి పాఠాలు మాకు ఒక మార్గనిర్దేశం చేశాయనడంలో సందేహం లేదు.

మేము ముద్దుగా పిలక మాష్టరు అని పిలచుకునే మా రెండవ సంస్కృత గురువుగారు శ్రీ శ్రీనివాసన్ గారితో నాకున్న అనుబంధం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. హైస్కూలు మొదట రెండు సంవత్సరాలలో ఆయన నా మీద చూపించిన ప్రత్యేక వాత్సల్యం, ఆయన మీద నాకున్న గౌరవం, మా ఇంటి దగ్గరలోనే ఆయన నివసించడం వలన, ఆయనకు అప్పుడప్పుడు ఇంట్లో సహాయపడే అవకాశం రావడంవల్ల నాకు ఆయనంటే ప్రత్యేక అభిమానం ఉండేది. నేను 7వ తరగతి చదువుతున్న రోజులలో ఆయన నా చేత నాటించిన వేపచెట్టు, యూకలిప్టస్ చెట్టు 5 సంవత్సరాల క్రితం స్కూలు ప్రాంగణంలో చూసినప్పుడు ఆయన నాకు ఎంతో గుర్తుకు వచ్చారు.

నిండైన విగ్రహంతో, చెరగని చిరునవ్వుతో మాకు విద్యాబుద్ధులు నేర్పిన శ్రీ బాచిన నరసింహారావు మాష్టారు గారు నాకు ఎల్లప్పుడూ పూజ్యనీయులు. పాఠశాల ఆవరణలోనే కాకుండా వారి ఇంటిలో కూడా నాకు ట్యూషన్ చెప్పి సొంత కొడుకులా చూసుకున్న మా నరసింహారావు మాష్టారు నాకు చాలా ఇష్టమైన గురువులు. 6,7 తరగతుల్లో నేను అమ్మ నాన్న లేపకుండానే వేకువజామున 4 గంటలకే లేచి వారి ఇంటికి వెళ్ళి చదువుకోవడానికి ఉత్సాహాన్ని చూపించేవాన్ని అంటే, ఆయనంటే నాకు ఎంత ఇష్టమో తెలుస్తుంది.

నేను 8వ తరగతి ప్రవేశించేముందు, అప్పటిదాకా మాకు రెండు సంస్కృతం గురువుగారిలాగా పనిచేసిన శ్రీనివాసన్ మాష్టారి పదవీ విరమణతో, ఆయన స్థానంలో వచ్చిన శ్రీ దారపనేని మునిరత్నంనాయుడు మాష్టారుతో తరగతిలో ఎక్కువ అనుబంధం లేకపోయినా, వారి కుమారుడు రాము నా జూనియర్ మరియు నా స్నేహితుల్లో ఒకరు కావడం వల్ల, మాష్టారుతో నాకు ఒకింత పరిచయం పెరగడానికి సహాయపడింది. ఎప్పుడూ చిరునవ్వుతో, మాకు అప్పటిదాకా అంత పరిచయంలేని శ్రీకాళహస్తి తెలుగు యాసతో, మాలో ఒక చెరగని ముద్ర వేశారనడంలో సందేహంలేదు.

"అస్థి ఉత్తరస్యాం దిశి దేవతాత్మా, హిమాలయో నామ నగాధిరాజః" అంటూ స్పష్టమైన ఉచ్చారణలో తన మాధుర్యమైన గొంతుతో కుమార సంభవం పాఠంలోని శ్లోకాన్ని నేర్పుతూ మాకు సంస్కృతం నేర్పిన శ్రీ సురం సుధాకర్ మాష్టారు వల్లే నాకు సంస్కృతం పట్ల ఆసక్తి, అభిమానం కలిగాయని ఉడంకాపథంగా చెప్పవచ్చు. చెక్కు చెదరని తలకట్టుతో, మడత నలగని బట్టలతో, మొదట్లో మితభాషి అనిపించే మా సుధాకర్ మాష్టారు తరువాత రోజుల్లో మాతో బాడ్మింటన్ ఆడుతూ, మమ్మల్ని బాగా ప్రోత్సహించేవారు. సరిగ్గా గుర్తులేదుకానీ, 9వ తరగతిలో అనుకుంటా, ఆయన మాకు 'ఏకసంథాగ్రాహి' అనే పదాన్ని గురించి చెబుతూ మాకు ఒక సవాలు విసిరారు. అది ఏంటంటే, మా పాఠ్యపుస్తకంలో ఉన్న ఒక కఠిన పద్యాన్ని ఎవరైతే అతి తక్కువ కాలంలో కంఠతా చేసి తిరిగి చూడకుండా చెప్పగలరో అని. ఆ సవాలుని స్వీకరించి అతి తక్కువ సమయంలో చెప్పి ఆయన ప్రశంసలు అందుకోవడం నాకు చాలా ఆనందం కలిగించే సంఘటన. ఆ పాఠం పేరు "రసాలసాల", ఆ పద్యం **"ప్రచండ చండ రశ్మి తాపనాత్మనా భరం పరం, స్వపాద మాశ్రితం జనాం సుఖాం కరోషి సంతతం…."** అంటూ మొదలవుతుంది. ఈ పద్యం నాకు ఇంకా గుర్తు ఉంది అంటే ఆయన నాలో ఎంత స్ఫూర్తి నింపారో అర్థం చేసుకోవచ్చు. నేను ఇంటర్మీడియట్‌లో చేరినప్పుడు మాకు సంస్కృతం సబ్జెక్ట్ ఉండటం, అందులోని పాఠాలు నాకు చాలా సులభంగా అనిపించి వేరే విద్యార్థులందరికి సహాయపడేలా చేసిందంటే దాని క్రెడిట్ అంతా మా పాఠశాలకు, మా సంస్కృత గురువుగార్లకు చెందుతుంది.

నేను ఐదో తరగతి పూర్తి చేసుకొని ఆరో తరగతిలో హైస్కూలుకి ప్రవేశించగానే అదే సమయంలో (1982 సంవత్సరం) మాకు డ్రిల్ మాస్టరు (పిఇటి)గా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీ నర్రా గోపాలరావు మాస్టారంటే వణుకు పుట్టని విద్యార్థి మొదటి ఆరు నెలల్లో ఉన్నాడంటే అనుమానమే. ఆయన రాగానే మా చేత పాత గ్రౌండ్ మొత్తం శుభ్రం చేయించి, మాతో కఠోరమైన వార్మప్ డ్రిల్స్ చేయించేవారు.

కోపమొస్తే నాలుగు గట్టిగా పీకేవారు. మొదట్లో అలా భయపెట్టినా, తరువాత రోజుల్లో నాకు ఆయన అత్యంత ఇష్టమైన గురువుగా అయ్యారనటంలో ఏ మాత్రం సందేహంలేదు. గోపాలరావు మాష్టారు అందరు తల్లితండ్రులతో క్రీడలు ఎలా మానసిక వికాసానికి, చదువులో కూడా ఎలా తోడ్పడుతాయో చాలా చక్కగా వివరించేవారు. ప్రత్యేక శ్రద్ధతో ఆయన మమ్మల్ని బాడ్మింటన్, కబడ్డీ పోటీలకు చుట్టు ప్రక్కల దగ్గర గ్రామాలకే కాకుండా రుద్రవరం, చీమకుర్తి, ఒంగోలు వంటి మరిన్ని ప్రదేశాలకు తీసుకువెళ్ళి మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేవారు. నా హైస్కూలు అయిపోయిన తరువాత కూడా మాష్టారుతో నాకు ఎంతో సాన్నిహిత్యం ఉండేది. వాళ్ళ అబ్బాయి శ్రీకాంత్, అమ్మాయి చైతన్య కూడా నాకు చాలా ఆప్తులుగా ఉండేవారు. ఈ రోజు నేను నా సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వృత్తితో పాటు, అమెరికాలో ఒక అంతర్జాతీయ స్థాయి క్రీడా సంస్థను (www.sparcarena.com) నెలకొల్పి కొన్ని వందల మందికి వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నానంటే దానికి గోపాలరావు మాష్టారు నాలో నింపిన క్రీడా స్ఫూర్తి కూడా దోహదపడిందని చెప్పడంలో ఏ మాత్రం అనుమానం లేదు.

ఇంతమంది గురువులతోపాటు, అందరి విద్యార్థుల ఉన్నతికి తోడ్పడిన పాఠశాల మిగతా సిబ్బందిని కూడా గుర్తుకు చేసుకోవడం చాలా అవసరం. శ్రీ వద్దినేని శేషయ్యగారు నాపై చూపిన ఆదరణ, వాళ్ళ అబ్బాయి కోటుతో పాటు నేను వారి ఇంట్లో క్రికెట్ టీవిలో చూడడానికి గడిపిన సమయం ఎప్పటికీ మర్చిపోలేను. అలాగే స్వర్గీయ శ్రీ కొమ్మినేని వెంకయ్యగారు మా లైబ్రరీని చక్కగా నడిపిస్తూ మమ్మల్ని చాలా ప్రేమగా, ఆప్యాయంగా చూసుకునేవాళ్లు. అలాగే శ్రీ కొమ్మినేని రంగనాయకులుగారు, మా అటెండర్ షేక్ కరీముల్లా, మా స్కూలు ప్రాంగణం ఎప్పుడూ శుభ్రంగా ఉంచడానికి సహాయపడిన చాంద్‌బీబీ (సంద) తో మాకున్న అనుబంధం ఎప్పటికీ మర్చిపోలేనిది.

గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన నాకు, మా పాఠశాల గురువులతో పాటు, సహ విద్యార్థులు స్నేహం, గ్రామస్తుల మంచితనం, పరిసరాల ప్రభావం నాపై ఎంతగానో ఉందని చెప్పుకోవచ్చు. ముందుగా ప్రస్తావించినట్లు ఈ వజ్రోత్సవం జరుపుకోవాలని నిర్ణయించిన దగ్గరనుండి, ప్రతిరోజు నాకు ఎన్నో జ్ఞాపకాల దొంతరలు సినిమా రీళ్ళలాగా మదిలో దొర్లుతూ నన్ను ఎంతో ఆనందోద్వేగాలకు గురి చేస్తూ, ఎప్పటికప్పుడు అందరినీ కలుసుకోవచ్చు అని ఆరాటపడేలా చేస్తున్నాయి. ఈ జ్ఞాపకాల దొంతరల నుంచి కొన్నింటిని ఈ క్రింద పేర్కొంటే, దాని ద్వారా మీ అనుభవాలు, జ్ఞాపకాలు కూడా మీకు గుర్తుకు వచ్చి మిమ్మల్ని కొద్దిసేపు బాల్యంలోకి తీసుకువెళ్తాయని నా చిన్న ప్రయత్నం.

- ★ కుల మత, ధనికపేద, చిన్నపెద్ద తారతమ్యం లేకుండా “ఒరే గిరే” అనుకుంటూ దాదాపు గ్రామంలో ప్రతి వారి ఇంట్లో నేను గడిపిన రోజులు, గ్రౌండులో ఆడిన క్రికెట్, బాడ్మింటన్, కబడ్డీ లాంటి క్రీడలు, ఊరి వీధుల్లో ఆడిన గోళీలు, బొంగరాలు, బచ్చాలాట, ఓకులాట, కర్రాబిల్లా, పేడబుర్ర లాంటి ఆటలు ఎన్నటికీ మర్చిపోలేని తీపి గుర్తులు.
- ★ ‘రండి చూడండి, చూసి ఆనందించండి, ఆలోచిస్తే ఆశాభంగం, ఈ రోజు మన వూరు

చేకూరపాడులో ఒకే ఒక్క ఆటగా, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు, సరసన సావిత్రి నటించిన గొప్ప సాంఘిక తెలుగు చిత్రం 'దేవత' ప్రదర్శించబడుతుంది. కేవలం ఒక్క రూపాయి మాత్రమే" అంటూ చిన్న రిక్షా బండితో సాయంత్రం నుండి బుడే హడావుడి చేస్తూ మైకులో చెబుతూ తను వేసే తెర సినిమాను చూసి ఎంతో ఎంజాయ్ చేసిన రోజులని ఎలా మర్చిపోగలం.

★ స్నేహితులందరితో ఉదయాన్నే లేచి స్నేహితులతో కలసి వినాయక చవితి పత్రికోసం జిల్లేడు, దానిమ్మ, మరునిమ్మ, గన్నేరు, ఉమ్మెత్త... అంటూ పాతేరు, తోటలు అన్ని తిరుగుతూ గుండ్లకమ్మలో ఈత కొట్టే రోజులు ఎప్పటికి మర్చిపోలేనివి.

★ ఇంట్లో తెలిస్తే తిట్టి కొడతారని భయపడి అతి తెలివి ప్రదర్శించి గుండ్లకమ్మలో ఈత కొట్టిన తరువాత ఎరుకలపాలెంలో స్నేహితుల ఇళ్ల దగ్గర ఆగి జుట్టుకి కొద్దిగా పారాచుట్ కొబ్బరి నూనె తగిలించి, ముఖానికి కొద్దిగా పాండ్స్ పౌడర్ అద్దినప్పటికీ, ఇంటి గుమ్మ దగ్గరే ఆ వార్త అప్పటికే తెలుసుకున్న అమ్మ నాలుగు తగిలించడం ఎలా మర్చిపోగలం.

★ స్నేహితులందరూ కలిసి ప్రభ కట్టి దాన్ని పోకూరి శ్రీను వాళ్ళ పొట్టేలతో లాగించడం, మాడిపోయిన లైట్ బల్బు, బూతద్దం సహాయంతో అట్టపెట్టెతో ప్రొజెక్టర్ తయారుచేసి బుడే దగ్గర కొట్టేసిన సినిమా రీల్లు ఉపయోగించి గోడమీద వేసిన సినిమా బొమ్మల్ని మరిచిపోవాలంటే సాధ్యపడే విషయమేనా?

★ పగలంతా స్కూలులో ఉన్నప్పటికీ, గురవయ్య మాష్టారు ఏర్పాటు చేసిన ఎక్స్ట్రా స్టడీ అవర్స్, తరువాత త్రోవగుంట రాఘవ మాస్టారు ఏర్పాటు చేసిన ట్యూషన్‌తో దాదాపుగా రాత్రులు కూడా స్నేహితులతో కలసి స్కూలు ఆవరణంలోనే బెంచీల మీద నిద్రపోవటం, అల్లరి పనులు చేసి దొరికిపోయి తన్నులు తినటం ఎప్పటికీ మర్చిపోలేని విషయాలు. అలాగే మాకు ట్యూషన్ చెప్పిన శ్రీ పోకూరి రమేష్ గారికి నా ప్రత్యేక ధన్యవాదములు.

★ చేకూరపాడు మిత్రులతో పాటు, వలేటివారిపాలెం నుంచి వచ్చి చదువుకున్న స్నేహితులతో ఉన్న అనుబంధం తప్పకుండా గుర్తుకు చేసుకోవాలి. ముఖ్యంగా వాళ్ళు నన్ను వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళి, వాళ్ల ఇంటిలో ఒకవాడిగా చూసుకోవడం చాలా అభినందనీయం.

★ కరణం గారి అబ్బాయి శేషయ్యగారి దగ్గర ట్యూషన్‌కి వెళ్లేటప్పుడు, వేకువజామున్నే జాన్ సాయిబు గారింట్లో కాళీషాబీ చేస్తున్న సన్నాయి ప్రాక్టీసుని ఎలా మర్చిపోగలము. కాళీషాబీ గారు, ఆవిడ భర్త సుభానీ గారు ప్రపంచ ప్రసిద్ధ గాంచిన సన్నాయి వాద్యకారులు అని ఇటీవల కాలంలో తెలుసుకొనటం చాలా ఆనందాన్ని కలుగజేసే విషయం.

★ మా ఇంటి వెనుక చెన్నమ్మ గారింట్లో, అలాగే ఇంకా కొద్ది మంది గ్రామస్తులు పెంచిన ఒంగోలు జాతి ఆంబోతులు, మన ఊరికే కాకుండా మన రాష్ట్రానికి మొత్తం పేరు తెచ్చే విధంగా ఉండటం మనకు చాలా గర్వకారణం.

ఈ వజ్రోత్సవం పుణ్యమా అని, నాకు ఇప్పటికే చాలామంది మిత్రులతో, కొంతమంది సీనియర్లు జూనియర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఏర్పాట్ల విషయాలు ముఖ్యంగా శిరిగిరి తారక్‌నాథ్ గారు, మా ఉమా బావ(తన్నీరు ఉషాకిరణ్), పోకూరి వెంకటరావు(డా॥పి.వి.), పోకూరి శ్రీను, ముత్తన సుబ్బారావుగారు, వద్దినేని కోటేశ్వరరావు, మాధవీలత (పెనుబోతు), రావూరి శ్రీనివాసరావుగారు, ఇంటూరి బాలాజీ, స్వర్ణ బాబురావుగారు మొదలైనవారితో చర్చించడం చాలా సంతోషాన్ని కలుగచేస్తుంది.

స్వర్ణ రామారావు, పోకూరి శ్రీను, వలేటి భాను, బొద్దులూరి సుధాకర్, బాలినేని ఆనంద్, వద్దినేని రామమూర్తి, వద్దినేని కోటేశ్వరరావు, ఆలా శ్రీనివాసరావు, వలేటి దశరథ రామయ్య, కంబాలపల్లి వెంకటరావు, మన్నేపల్లి శ్రీను లాంటి సన్నిహితులతో నా బాల్యంలో ఎక్కువ సమయం గడిపినప్పటికీ చేకూరపాడు గ్రామంలో నాకు వందకు పైగా స్నేహితులు ఉన్నారంటే నిజంగా చాలా ఆనందాన్ని కలుగజేస్తుంది. అంతమంది స్నేహితులను పొందిన నేను చాలా అదృష్టవంతున్ని. వీరందరితో గడిపిన బాల్య స్మృతులు ఎప్పటికీ చెరిగిపోలేనివి.

చివరిగా, ఈ పాఠశాల స్థాపనకు కృషి చేసిన వ్యవస్థాపక సభ్యులందరికీ, దానికి తోడ్పడిన గ్రామస్తులందరికీ నా హృదయపూర్వక నమస్కారములు. ముఖ్యంగా నాకు బాగా పరిచయమున్న వడ్డెల్ల వీరయ్య పెదనాన్న నేర్పిన గణిత పజిల్స్, శిరిగిరి భానుప్రసాద్ (చిన బైరాగి) గారింట్లో చూసిన టెన్నిస్ మ్యాచులు, వాటి గురించి సంభాషణలు, పోకూరి వెంకటసుబ్బయ్య గారింట్లో గడిపిన సమయం, వారి సమయస్ఫూర్తి వేసే చలోక్తులు ఎన్నటికీ మరువలేనవి. ఈ వజ్రోత్సవ సందర్భంగా మన పాఠశాల పుట్టు పూర్వోత్తరాలు విపులంగా తెలుసుకోవడం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది.

అలాగే, ఈ వజ్రోత్సవం అనే బ్రహ్మాండమైన ఆలోచనను ముందుకు తెచ్చి, విద్యా బోధనలందించిన గురువులను సన్మానించుకునే అవకాశంతో పాటు, పూర్వ విద్యార్థులందరినీ సమ్మేళన పరచి వారితో ఆనందానుభూతులతో పాటు అనుభవాలు, చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించి, అందులో నన్నుకూడా భాగస్వామిని చేసినందుకు, మన పాఠశాల పూర్వ విద్యార్థుల వెబ్‌సైట్ తయారుచేసే అవకాశం నాకు కల్పించినందుకు, ఈ కార్యక్రమ కార్యవర్గ సభ్యులందరికీ పేరు పేరునా నా ధన్యవాదములు.

ఇట్లు మీ

**రఘు రావిపాటి.**

1982–1987 బ్యాచ్

**నా వివరములు:**

**తల్లిదండ్రులు :** సుభద్ర (పెనుబోతు), రావిపాటి మధుసూధనరావు, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టరు, వ్యవసాయశాఖ, ఆంధ్రప్రదేశ్.

**భార్య :** శిరీష (బ్లూక్రాస్ బ్లూ షీల్డ్ ఐటి మేనేజర్, డెట్రాయిట్)

**పిల్లలు :** సమన్వి - 10వ తరగతి, అన్విత - 7వ తరగతి.

**నివాసం :** డెట్రాయిట్, మిషిగన్, అమెరికా

**వృత్తి :** సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ (జిరాక్స్ కార్పొరేషన్, EHIM మొ॥)

**చెల్లెలు :** కళ్యాణి పాటిబండ్ల, ఫియెనిక్స్, అమెరికా, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్

**ఇతరములు :**

- 2013 డిట్రాయిట్ తెలుగు అసోసియేషన్ - ప్రెసిడెంట్
- 2015 తానా 20వ మహాసభలు - కోర్ కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటి ఛైర్మన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్
- స్పార్క్ ఎరినా (www.sparcarena.com) - ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్ (అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ట్రైనింగ్ ఫెసిలిటీ)
- డిట్రాయిట్ ఇండియన్ సెంటర్, స్థాపకులు (అకడమిక్ & కల్చరల్ యాక్టివిటీ సెంటర్).
- గత కొద్ది సంవత్సరాలలో 1000 పిల్లలకు పైగా వాలిబాల్, షటిల్ బాడ్మింటన్ క్రీడల్లో శిక్షణ.
- సిటి ఆఫ్ నోవై వాలంటీర్ శిక్షకులు.
- డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి సభ్యులు.